

నాచారంలో ఆటో కార్మికుల సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీపీటీయూ నాయకులు

# మా పొట్ట కొట్టొద్దు

- ప్రభుత్వానికి ఆటో కార్మికుల సంఘం టీపీటీయూ విజ్ఞప్తి
- రేపు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆటో కార్మికుల సదస్సు
- ఆటోకార్మికుల సమస్యలపై టీపీటీయూ కరపత్రం విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'మా కుటుంబాల్లో కూడా మహిళలు ఉన్నారు.. మా పొట్ట కొడితే ఇంట్లోని మహిళలకు కన్నీరే మిగులుతుంది' అని తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీపీటీయూ) నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆటో కార్మికుల కుటుంబాలను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆటో కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర నాయకుడు వేముల మారయ్య తెలిపారు. నాచారంలోని ఆటో యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆటో కార్మికుల కష్టాలు, డిమాండ్లపై కరపత్రం విడుదల చేశారు. ఉచిత బస్సు ప్రయాణం తాత్కాలికంగా సరైనదే అనిపించినప్పటికీ.. దీర్ఘకాలికంగా ఆ పథకాన్ని అమలు చేయడం కష్టంగా మారుతుందని పేర్కొన్నారు. ఆ నష్టమంతా మళ్లీ ప్రజలపైనే పడుతుందని వివరించారు. ఆటోడ్రైవర్లు తమ వృత్తినే వదిలేసుకుని రోడ్డున పడాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పీ నారాయణ, ఎం విజయ్‌కుమార్, నిరంజన్, దయ్యాల దాసు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేట, చెన్నారావుపేటలో ఆటోలతో భారీ ర్యాలీ తీసి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఏడాదికి రూ.12 వేలు ఇస్తాం

- ఆటో డ్రైవర్లు చింతించొద్దు: పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్, డిసెంబర్ 17: ఆటోడ్రైవర్లు చింతించాల్సిన అవసరం లేదని, వారిని ఆదుకునేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నదని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన జిల్లాకు వచ్చిన సందర్భంగా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద ఆటో ఓనర్లు, డ్రైవర్లు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటోల గిరాకీ లేకుండా పోయిందని, ఫలితంగా తాము జీవనోపాధి కోల్పోతున్నామని తెలిపారు. మంత్రి స్పందిస్తూ.. ఆటోవాళ్లకు ఏడాదికి రూ.12 వేలు అందించే కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. ఆటో నగర్ పెట్టుకుంటే స్థలంతోపాటు ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# పురుషులకు సీట్లు కేటాయించండి

- మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన రద్దీ
- సీట్లు దొరక్క పురుషుల నిరసనలు
- సమస్యలను గుర్తించి పరిష్కరిస్తం అంటున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'మహిళలను గౌరవించండి.. వారికి కేటాయించిన సీట్లను వారికే ఇవ్వండి'.. ఇది ఆర్టీసీ బస్సుల్లో కనిపించే స్లోగన్. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. దీంతో బస్సుల్లో తమకు సీట్లు దొరకని పరిస్థితి నెలకొన్నదని పురుషులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో పురుషులకూ ప్రత్యేక సీట్లు కేటాయించాలని నిరసన వ్యక్తం చేసిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఓ యువకుడు బస్టాండ్‌లో బస్సుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపాడు. నగరంలోని మెహిదీపట్నం రూట్‌లో సైతం పురుషులు బస్సుల్లో సీట్లు లేవని బస్టాండ్‌లో నిరసనకు దిగడం గమనార్హం. బస్సుల్లో కనీసం 15 సీట్లు పురుషులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మహిళలు వారికి కేటాయించిన సీట్లే కాకుండా పురుషుల సీట్లలోనూ కూర్చుంటున్నారని దాంతో అత్యవసరంగా వెళ్లే తమకు సీట్లు దొరకటం లేదని వాపోతున్నారు. మహిళలంటే తమకు గౌరవమేనని.. వారికి బస్సుల్లో 30 సీట్లు కేటాయిస్తే.. కనీసం 15 సీట్లైనా పురుషులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

### మహిళా ప్రయాణికుల ఆందోళన

వికారాబాద్ జిల్లా తాండూర్ బస్‌డిపో ఎదుట శనివారం మహిళ ప్రయాణికులు ఆందోళన చేశారు. దాదాపు రెండు గంటలు గడిచినా హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులు లేవంటూ ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నపిల్లలతో చాలాసేపు వేచి చూడాల్సి వస్తుందని, ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో రూట్ బస్సులు తక్కువగా ఉండటంతో ఒకే బస్సులో కెపాసిటీకి మించి జనం ఎక్కడంతో బస్సులు నిలిచిపోతున్నాయి. ఇలాంటి ఘటన ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. ఇలాంటి సంఘటనలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని.. కొన్ని సందర్భాల్లో, కొన్ని రూట్లలో మాత్రమే ఈ సమస్య తలెత్తుతుందని తెలిపారు. త్వరలోనే కొత్త బస్సులు అందుబాటులోకి వస్తాయని, బాగా రద్దీ ఉన్న రూట్లలో అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

- యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. ధనుర్మాసోత్సవం ప్రారంభంతోపాటు ఆదివారం సెలవు రోజు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాడ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరుమాడ వీధులు భక్తులతో రద్దీగా మారాయి. ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని సుమారు 40 వేల మంది దర్శించుకోగా, ఖజానాకు రూ.54,09,081 ఆదాయం సమకూరిందని ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి తెలిపారు. - యాదగిరిగుట్ట



ఆదివారం రాత్రి మెదక్ జిల్లా ఏడుపాయల రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

# బస్సులు లేవంటూ మహిళల ధర్నా

- ఏడుపాయలలో భక్తుల ఆగ్రహం

కొల్చారం, డిసెంబర్ 17: 'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని పిల్లాపాపలతో అమ్మవారి దర్శనానికి వచ్చాం. కానీ ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులు నడపడంలో విఫలమయ్యారు' అని పలువురు మహిళలు, ప్రయాణికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తారు. ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదివారం మహిళా భక్తులు పిల్లాపాపలతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఏడుపాయల నుంచి కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి శివారులోని మెదక్-హైదరాబాద్ జాతీయరహదారి వద్దకు చేరుకుని బస్సు కోసం వేచిచూశారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ రోడ్డు గుండా ఒక్క ఆర్టీసీ బస్సు రాలేదు. దీంతో వందలాది మంది భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం అయింది. అంతలో అటుగా వెళ్తున్న పల్లె వెలుగు బస్సును ఆపినప్పటికీ అది నిండుగా ఉంది. చేసేదిలేక మహిళా భక్తులు.. బస్సు డ్రైవర్ ఫోన్ నుంచి మెదక్ డీఎం సుధకు కాల్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన డీఎం రెండు బస్సులు పంపడంతో ప్రయాణికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

- ఆడబిడ్డల కష్టాలు తీర్చేందుకే కల్యాణలక్ష్మి



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో పలు మండలాలకు చెందిన 118 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఆడబిడ్డల కష్టాలను గుర్తించే కేసీఆర్ ఈ పథకాన్ని తెచ్చారని చెప్పారు.



పూర్వవిద్యార్థి కానాహైలాల్‌తో వీసీ నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ తదితరులు

# జేఎన్టీయూకు రూ.కోటి విరాళం

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబర్ 17: జేఎన్టీయూహెచ్ వర్సిటీ అభివృద్ధికి మొదటి బ్యాచ్ (1971) పూర్వవిద్యార్థి, వ్యాపారవేత్త, గోల్డ్‌డ్రాప్ అధినేత కానాహైలాల్ లోహియా రూ.కోటి విరాళాన్ని అందించడానికి ముందకు రావడం అభినందనీయమని వర్సిటీ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం వర్సిటీ వీసీ చాంబర్‌లో పలు బ్యాచ్‌లకు చెందిన పూర్వవిద్యార్థులతో వీసీ నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ సమావేశమయ్యారు. ఇందులో పూర్వవిద్యార్థి, గోల్డ్ డ్రాప్ అధినేత కానాహైలాల్ లోహియా కోటి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పూర్వవిద్యార్థులంతా వర్సిటీ అభ్యున్నతి కోసం ముందుకు రావడం సంతోషకరమని చెప్పారు. త్వరలోనే పూర్వవిద్యార్థుల సమ్మేళనం వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూఐఐసీ డైరెక్టర్ తారకల్యాణి, డిప్యూటీ డైరెక్టర్ క్రాంతి, ఏఆర్వో ప్రసన్న తదితరులున్నారు.

## ప్రాణం తీసిన గ్యాస్ కేవైసీ

- తిండి లేక.. చలికి తాళలేక మృతి



అంగ పొచ్చన్న(ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 17: గ్యాస్ కేవైసీ ఓ వ్యక్తి ప్రాణం తీసింది. కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చిన అతడు.. రద్దీగా ఉండటంతో రాత్రికి ఇంటికెళ్లలేదు. ఆ పక్కనే ఓ లారీ కింద నిద్రించి.. ఆకలికి, చలికి తట్టుకోలేక మృతిచెందాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం సిరికొండకు చెందిన అంగ పొచ్చన్న(40), ఆయన కుమారుడు సాయి చరణ్ శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో కేవైసీ చేసుకోవడానికి వచ్చారు. జనం ఉండటంతో మధ్యాహ్నం పొచ్చన్న కుమారుడిని ఇంటికి పంపించాడు. తాను మాత్రం రాత్రికి ఇంటికెళ్లకుండా అక్కడే ఉండి లైన్‌లో నిల్చుంటే.. కేవైసీ తొందరగా చేయించుకోవచ్చని భావించాడు. అక్కడే ఓ లారీ కింద నిద్రపోయాడు. ఎంతకూ పొచ్చన్న ఇంటికి రాకపోవడంతో ఆదివారం ఉదయం ఆయన భార్య ప్రమీల, కొడుకు సాయిచరణ్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చి చూడగా.. ఆ దగ్గరలోనే ఉన్న లారీ కింద విగతజీవిగా కనిపించాడు. రోజంతా భోజనం చేయక పోవడం, చలి తీవ్రతతోనే మృతి చెందినట్టు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

## పీఆర్జీటీఏ సంఘం ఆవిర్భావం

**రాష్ట్ర అధ్యక్షుడిగా దిలీప్ ఎన్నిక**

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గురుకులాల టీచర్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కొత్త సంఘం ఆవిర్భవించింది. పీఆర్టీయూ టీఎస్‌కు అనుబంధంగా ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్జీటీఏ) ఏర్పడింది. ఆదివారం నారాయణగూడలోని పీఆర్టీయూ టీఎస్ కార్యాలయంలో సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. పీఆర్జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వీ దిలీప్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఏ నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం వేణుప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనార్టీ గురుకులం కన్వీనర్‌గా పానుగంటి విజయ్‌కుమార్, కో-కన్వీనర్‌గా లక్ష్మారెడ్డి, బీసీ గురుకులం కన్వీనర్‌గా బీ గట్టయ్య, కో-కన్వీనర్‌గా ఆర్ రాజ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ గురుకులం కన్వీనర్‌గా ఎం నాగేశ్వర్‌రావు, కో-కన్వీనర్‌గా ఓరుగంటి నవీన్ ఎన్నికయ్యారు.

# మున్సిపల్ ముఖ్యకార్యదర్శిగా దానకిశోర్

- 11 మంది ఐఏఎస్, 10 మంది ఐపీఎస్‌ల బదిలీలు
- మరో ఐదుగురు పోలీస్ అధికారులకు స్థాన చలనం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఐఏఎస్, ఐపీఎస్‌ల వరుస బదిలీలు కొనసాగుతున్నాయి. ఇటీవలే 9 మంది 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు అదనపు కలెక్టర్లుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. తాజాగా ఆదివారం రాష్ట్రంలో 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు, 10 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కీలకమైన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా దానకిశోర్‌ను నియమించగా, ఆ స్థానంలో ఉన్న అర్వింద్ కుమార్‌ను విపత్తు నిర్వహణ శాఖకు బదిలీ చేసింది. నల్లగొండ కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా నియమించింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా విశ్వప్రసాద్, హైదరాబాద్ పోలీస్ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీగా ఏవీ రంగనాథ్‌కు బాధ్యతలు అప్పగించింది. వీరితోపాటు మరో ఐదుగురు సీనియర్ పోలీస్ అధికారులకు స్థానచలనం కల్పించింది. ఇందులో కొందరు ఐపీఎస్, పోలీస్ అధికారులను డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.



దానకిశోర్, అర్వింద్‌కుమార్, బుర్రా వెంకటేశం, ఏ వాణీప్రసాద్, శ్రీనివాసరాజు, రాహుల్‌బొజ్జా, సుదర్శన్‌రెడ్డి, క్రిస్టినా చోంగ్తూ, టీకే శ్రీదేవి, వాకాటి కరుణ, ఆర్వీ కర్ణన్, ఐపీఎస్‌లు: పీ విశ్వప్రసాద్, ఏవీ రంగనాథ్, విజయ్‌కుమార్, జోయల్ డేవిస్, రోహిణి ప్రియదర్శిని, ఎన్ శ్వేత, సుబ్బారాయుడు, నిఖితాపంత్, గజరావ్ భూపాల్

### జలమండలి బోర్డుపై దానకిశోర్ ముద్ర

జలమండలిబోర్డుపై దానకిశోర్ తనదైన ముద్రవేశారు. ఐటీ, రెవెన్యూ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో విప్లవాత్మకమైన మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చారు. వేసవిలోనూ తాగునీటి ఎద్దడి లేకుండా సమృద్ధిగా నీటిని అందించారు. తన పనితీరుతో బోర్డుకు అనేక అవార్డులు తెచ్చిపెట్టారు.

### నాన్‌క్యాడర్ ఐపీఎస్‌లు

| | | |
|---|---|---|
| ఎన్ వెంకటేశ్వర్లు | వెయిటింగ్ | హైదరాబాద్ సిటీ ట్రాఫిక్-3 డీసీపీ |
| డీ శ్రీనివాస్ | హైదరాబాద్ సిటీ ట్రాఫిక్-3 డీసీపీ | డీజీపీ ఆఫీసుకు అటాచ్డ్ |
| శ్రీబాలాదేవి | రాచకొండ రోడ్డు సేఫ్టీ విభాగం డీసీపీ | హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీ |
| జీ సందీప్ | సైబరాబాద్ కమిషనరేట్‌లో మాదాపూర్ డీసీపీ | రైల్వే అడ్మిన్ ఎస్పీ |
| జే రాఘవేందర్‌రెడ్డి | రైల్వే అడ్మిన్ ఎస్పీ | డీజీపీ ఆఫీసుకు అటాచ్డ్ |

### ఐఏఎస్ బదిలీలు ఇలా...

| పేరు | బ్యాచ్ | ప్రస్తుత స్థానం | బదిలీ |
|---|---|---|---|
| దాన కిశోర్ | 1996 | జలమండలి ఎండీ | పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు |
| అర్వింద్ కుమార్ | 1991 | పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి | విపత్తు నిర్వహణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ |
| బుర్రా వెంకటేశం | 1995 | బీసీసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ | విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు |
| ఏ వాణీ ప్రసాద్ | 1995 | రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ | అటవీ, పర్యావరణశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్యకార్యదర్శి, ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు |
| కేఎస్ శ్రీనివాసరాజు | 1999 | వెయిటింగ్ | ఆర్‌అండ్‌బీ, రవాణా శాఖల కార్యదర్శి |
| రాహుల్ బొజ్జా | 2000 | ముఖ్యమంత్రి కార్యదర్శి | జీఏడీ కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధిశాఖ కమిషనర్, కార్యదర్శిగా అదనపు బాధ్యతలు |
| సీ సుదర్శన్‌రెడ్డి | 2002 | పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి | జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ |
| క్రిస్టినా జెడ్ చొంగ్తు | 2001 | వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ | వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి |
| టీకే శ్రీదేవి | 2004 | రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి | వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ |
| వాకాటి కరుణ | 2004 | విద్యాశాఖ కార్యదర్శి | మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి |
| ఆర్వీ కర్ణన్ | 2012 | నల్లగొండ కలెక్టర్ | వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ |

### బదిలీ అయిన ఐపీఎస్‌ల వివరాలు

| | | | |
|---|---|---|---|
| పీ విశ్వప్రసాద్ | 2005 | హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ సీపీ | హైదరాబాద్ సిటీ అడిషనల్ కమిషనర్(ట్రాఫిక్) |
| ఏవీ రంగనాథ్ | 2006 | వెయిటింగ్ | హైదరాబాద్ సిటీ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ అండ్ సిట్ |
| ఎస్‌ఎం విజయ్ కుమార్ | 2012 | ఇంటెలిజెన్స్ ఎస్పీ | హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ |
| జోయల్ డేవిస్ | 2010 | హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ | హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ |
| రోహిణి ప్రియదర్శిని | 2012 | మెదక్ ఎస్పీ | హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీ |
| ఎన్ శ్వేత | 2012 | సిద్దిపేట కమిషనర్ | హైదరాబాద్ సిటీ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ |
| ఎల్ సుబ్బారాయుడు | 2013 | వెయిటింగ్ | హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ -1 డీసీపీ |
| నిఖితా పంత్ | 2017 | హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ | డీజీపీ ఆఫీసుకు అటాచ్డ్ |
| గజరావ్‌భూపాల్ | 2008 | హైదరాబాద్ సిటీ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ అండ్ సిట్ | డీజీపీ ఆఫీసుకు అటాచ్డ్ |




